# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 17 జులై, 2025 | పేజీలు :08


## ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాలు వేలం పాట

రూ.లు 2.19 లక్షలు ఆదాయం



**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు సిఐ ఠాకూర్ మహేందర్ సింగ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ధర్మపురి సర్కిల్‌లోని పలు స్టేషన్ల పరిధిలో గుడుంబా, నాటు సారా అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించగా, 18 వాహనాలకు గాను రూ.లు 2లక్షల 19వేల 964 రూ.ల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ మహేందర్ సింగ్ తెలిపారు. ఈ వేలం పాటలో ఎస్సై ఎం.ఎ.జమీల్, కానిస్టేబుల్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో
# విద్యాబోధన చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్తో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, త్రాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలో వసతులు, పడకలు, మూత్రశాలలు, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీగోడ, వంటశాల ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట పిల్లలు, మధ్య బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వారి పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న పోషక ఆహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. పాఠశాల, విద్యాలయంలో కిటికీలు, తలుపులు, మూత్రశాలలు, ఫ్యాన్లు, లైట్లు ఇతర పాడైన వాటిని పరిశీలించి మరమ్మత్తులు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పాడయిన ఆర్.ఓ. ప్లాంట్ను మరమ్మత్తు చేసి పునః రుద్ధరించి శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో మౌలిక వసతులను
# మెరుగుపర్చేందుకు చర్యలు



కలెక్టర్ అభిలాష అభినవ్..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ కళాశాలలలో మౌలిక వసతులు కల్పించేందుకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధనతోపాటు, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, 2417 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మెరుగైన విద్య బోధనతో పాటు అవసరం ఉన్న కళాశాలల్లో పై కప్పుల లీకేజీలు, మరమ్మత్తులు అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, ఆర్.ఓ ప్లాంట్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం, డిపిఒ శ్రీనివాస్, ఇంజనీరింగ్ శాఖలల అధికారులు, కళాశాలల ప్రిన్సిపల్స్, అధికారులు, సిబ్బంది, దితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి సంబరాల ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో ఈనెల 26న జరగనున్న ఇందిరా మహిళా శక్తి సంబరాల ఏర్పాట్ల పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహించే స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఏర్పాట్ల గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమీక్ష చేపట్టారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్రు హన్మా న్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, మద్ది తిరుపతిగౌడ్, సింగం కిరణ్‌గౌడ్, బొంతల రాజేష్, మహంకాళిస్వామి, పెద్దెల్లి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

**ప్రజాపక్షం/బైంసా:** బైంసా పట్టణంలో ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బైంసా సబ్‌డివిజన్ పరిధి లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 13 మంది అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు.సమస్యలను త్వరితగతిన పరిష్కరించేదుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం 'పాత్ర..**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు.కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది.ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎ స్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష :** ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కర స్థితి,ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పార్టీ చొప్పదండి మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని రాగంపేటలో గ్రామ ఇంచార్జి మాజీ ఎంపిపి వల్లాల కృష్ణహరి, గ్రామశాఖ అధ్యక్షుడు ఈర్ల స్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి గ్రామంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సంధర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయడంతో పాటు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం దిశగా పరిపాలన సాగిస్తున్నామన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో నియోజకవర్గంలో సంక్షేమం అభివృద్ధిని జోడు గుర్రాలుగా పరుగులు పెట్టిస్తున్నామని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, ముద్దసాని రంగన్న, ముద్దం తిరుపతి, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, కొట్టె అశోక్, మునిగాల సుధాకర్ గౌడ్, మావురపు రాములు, చీకటి కుమారస్వామి, కడారి శంకర్, జక్కుల అనిల్ కుమార్, పెరుమాండ్ల రవి, దూస కైలాసపతి, కళ్యాణపు శ్రీనివాస్, జహంగీర్, కనుకట్ల సురేష్, ఈర్ల కుమార్, మామిడి శ్రావణ్, సింగసాని ఓదయ్య, ఐతరవేని లచ్చయ్య, కోమల్ల అశోక్, దీకొండ రాజు తదితరులున్నారు.

## మల్లికార్జున స్వామి పెద్ద పట్నాలు, కళ్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/ముత్తారం :** శ్రీ ఆది మల్లికార్జున స్వామి, పట్నాలు, కళ్యాణ మహోత్సవాల కార్యక్రమాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు కుర్మా గొల్ల,యాదవ సంఘం కులస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు ప్రారంభమయ్యాయి.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి మల్లన్నగుట్ట వెలిసిన శ్రీ ఆది మల్లికార్జున స్వామి పెద్దపట్నం, కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు బుధవారంఉదయం 7 గంటలకు పాలు, నెయ్యి, పంచామృతాలతో మహాభిషేకం అమ్మవారు పోచమ్మ, గ్రామదేవత, అంజన్న స్వామి, బీరప్ప స్వామి,ఆది మల్లన్న స్వామివారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు బిందెలతో పాలు, మంగళహారతులతో మహిళలతోపాటు ఒగ్గు పూజారులు, కుర్మ గొల్ల కులస్తుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

## హుజురాబాద్‌లో ఈటల వర్గం వరుస సమావేశాలు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ వర్గంలో బిజెపిలో బండి సంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్ వర్గంగా మారింది. ఒకే పార్టీలో ఉన్న ఇద్దరి ఎంపిల మధ్య యుద్దవాతావారణమే నెలకొంది. ఈ మేరకు గత కొంత కాలం నుంచి కమలాపూర్, ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల్లో ఈటల వర్గీయులు వరుస సమావేశాలు నిర్వహించడం అందుకు బలం చేకూరుస్తోంది. బుధవారం జమ్మికుంట మాజీ సర్పంచ్ ఎర్రం రాజు సురేందర్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక సువర్ణ ఫంక్షన్ హాలులో హాజీ జడ్పీటిసి శ్రీరామ్ శ్యామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ ఎంపిటిసిలు , మాజీ సర్పంచులు, వార్డు సభ్యులైన ఈటల వర్గీయులు సమావేశమయ్యారు. బిజెపి నేతగా ఈటల రాజేందర్ మల్కాజిగిరీ ఎంపిగా ఉన్నప్పటికీ హుజురాబాద్ నియోజకవర్గంలో ఈటల వర్గం నాయకులకు తగిన ప్రాధాన్యం లేకుండా పోయిందని భావిస్తున్నారు. నియోజకవర్గంలో బిజెపి సమావేశాలు జరుగుతున్నా తమకు సమాచారమే ఇవ్వడం లేదని చర్చించుకుంటున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో గత బిజెపి కార్యకర్తలకే పెద్దపీట వేస్తారనే అనుమానాలు ఈటల వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ వర్గీయులను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో కొంతమంది బిజెపి నాయకులు యత్నిస్తున్నారని వాపోతున్నారు. ఈ వర్గపోరు హుజురాబాద్ నియోజకవర్గంలో బిజెపికి నష్టం వాటిల్లే అవకాశముందని పలువురు అంచనా వేస్తున్నారు. తగ్గేదేలే అన్నట్లుగా ఈటల వర్గీయులు ప్రణాళికలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ సమస్యను బిజెపి అధిష్టానం ఏ విధంగా పరిష్కరిస్తుందో? బండి సంజయ్ వర్గీయులు ఏ విధంగా స్పందిస్తారో? హుజుబాద్ నియోజకవర్గ బిజెపి పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఆర్థిక స్వాతంత్రంతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వాణినికేతన్ విద్యాసమితి సెక్రటరీ, కరెస్పాండెంట్ ఇలినాని దీపిక విధ్యార్థులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం కరీంనగర్‌లోని కెమిస్ట్ భవన్‌లో వాణినికేతన్ డిగ్రీ పిజి విధ్యార్థులు బ్రియో 2కె25 పేరిట వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కరెస్పాండెంట్ ఇలినాని దీపికతో పాటు కళశాల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు సరస్వతీ మాతకు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా వాణినికేతన్ విద్యాసమితి సెక్రటరీ, కరెస్పాండెంట్ ఇలినాని దీపిక మాట్లాడుతూ వాణినికేతన్ విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలో విశిష్టమైన గుర్తింపు సాధించాయన్నారు. ఇక్కడ చదువుకున్న ప్రతి విధ్యార్థి ఉద్యోగం పొందడమే కాకుండా ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆశించారు. వ్యక్తిత్వ వికాసమే విధ్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. డిగ్రీస్థాయిలో ఉన్న విధ్యార్థులకు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, శ్రద్ధ ఎంతో అవసరమని తెలిపారు. మంచి పాఠశాల, కళాశాల వాతావరణం విధ్యార్థుల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. డిగ్రీతోనే చదువు ఆగిపోకూడదని, ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం విధ్యార్థినీ విధ్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఉత్సాహంగా ఉల్లాసంఘా విధ్యార్థులు వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో వాణినికేతన్ విద్యాసమితి అద్యాపక, అధ్యాపకేతర బృందం, విధ్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రాబోవు స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో బిజెపి పార్టీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేస్తామని పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం భారతీయ జెనతా పర్టీ రాష్ట్ర కార్యాలయంలో బి జె పి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామ్ చందర్ రావు పెద్దపల్లి జిల్లా బిజెపి సీనియర్ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా బిజెపి పార్టీ పటిష్టంగా ఉంది అని రాష్ట్ర అధ్యక్షుడికి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు రామ్ చంద్రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో భారతీయ జనతా పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాబోవు ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో భారతీయ జనతా పార్టీ అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు . ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, అమరగాని ప్రదీప్, కొల్లూరి కుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో అరాచక పాలన...?!



**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం నియోజకవర్గంలో ప్రజాస్వామ్య పద్ధతులు తుంగలో తొక్కబడ్డాయని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి అన్నారు. బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, రామగుండం ఎమ్మెల్యే పనితీరును తీవ్రంగా విమర్శించారు. రామగుండంకు ఎమ్మెల్యే పార్ట్‌టైమా? ఫుల్‌టైమా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే కిందిస్థాయి నాయకులు రెచ్చిపోతూ హద్దులు మీరి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కెసీఆర్ పాలనలో గోదావరినది నిండుకుండలా ఉప్పొంగేదని, కానీ కాంగ్రెస్ హయాంలో గోదావరి ఎడారిగా మారిపోయిందన్నారు. బూడిదలో కూడ కమీషన్లు వస్తున్నాయనే ప్రచారం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ర్యాలీలకు అంక్షలు విధిస్తూ, కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఏలాంటి అంక్షలు లేవన్నారు. పోలీసులు రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకావద్దన్నారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు కట్టించారో తెలుపాలన్నారు. రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్లను కూల్చివేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఏడాది కాలంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రామగుండంలో అరాచక పాలన కొనసాగుతుందని, హైకోర్టు స్టే ఉన్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎవరు మాట్లాడిన దాడులకు పాల్పడుతున్నారన్నారు. రామగుండంలో స్కాములు, కూల్చివేతలు తప్ప అభివృద్ధి ఏమి కనిపించడం లేదన్నారు. అనంతరం ప్రధాన కూడళ్ల వద్ద అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు, అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తస్నీమ్ భాను, జాహిద్‌పాషా, రమణారెడ్డి, పొలాడి శ్రీనివాస్, బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి, అల్లి గణేష్, ఉదయ్, కొండా సురేష్, పోయిల రవిలు పాల్గొన్నారు.

## మూర్మూర్‌లో బోనాల పండుగ

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని మూర్మూర్ ఆదర్శ అంగన్వాడీ కేంద్రంలో ఆషాఢ మాసం బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు చేపట్టారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్.కమల, ఉపాధ్యాయురాలు పెండ్యాల విమల, ఎఎన్ఎం అన్నపూర్ణ, కారోబార్ పీతాంబర్, లక్ష్మి , లాస్య, లావణ్య, కందుగుల సంతోషి, సంధ్య, పుష్ప, జ్యోతి, స్రవంతి, శిరీషలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంలో పాము

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓ ద్విచక్ర వాహనంలోకి పాము దూరింది.ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన ఓ రైతు తన పంట పొలం వద్ద వాహనదారుడు తన వాహనాన్ని పార్కింగ్ చేయగా అందులోకి పాము(చెడుగు పాము) ద్విచక్ర వాహనంలోని చైన్స్ ప్యాకెట్ లో దూరింది. అయితే పాము దూరిన విషయం తెలియని ఆ రైతు ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేసి ఒడేడు బస్టాండ్ కి వెళ్తుండగా వాహనం ముందుకు కదలకుండా చైన్స్ ప్యాకెట్ జామై టైర్లు తిరగకుండా ఉన్నాయి. వెంటనే అక్కడే ఉన్న మెకానిక్ ఈను వద్దకు మోటార్ సైకిల్ తీసుకెళ్లగా చైన్స్ ప్యాకెట్ విప్పడంతో పాము మృతి చెంది చైన్ లో ఇరుక్కుని ఉంది. మృతిచెందిన పామును మెకానిక్ బయటకు తీశారు.కాగా వాహనంలో దూరిన పాము వల్ల వాహనదారుడు కి ఎలాంటి హాని కలగకపోగా ఊపిరి పీల్చుకున్నారు.

## డిజిటల్ తరగతులు ప్రారంభం

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థిలో నైపుణ్యాన్ని పెంచేందుకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా అకాడమిక్ ఇయర్ లో భాగంగా వీటిని ప్రారంభించారు.సైన్స్ గ్రూపు సంబంధించి నీట్, ఏప్సెట్ తరగతులు, ఆర్ట్స్ గ్రూపు సంబంధించి క్లాట్, సిఏ ఫౌండేషన్ తరగతులను బోధించనున్నారు. రెగ్యులర్ గా జరిగే తరగతులతో పాటు డిజిటల్ క్లాస్ లు నిర్వహిస్తారు.డిజిటల్ క్లాసులను ప్రారంభించడం పట్ల విద్యార్థినులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యను అందించడమే లక్ష్యంగా బోర్డు ఉన్నట్లు ప్రిన్సిపల్ సయ్యద్ సలీం తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామ శివారులో బుధవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. కాగా గాయాల పాలైన వీరిని అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు.ఈ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఒకరు సింగరేణి సమ్మయ్య కాగా మరో వ్యక్తి పేరు తెలియ రాలేదు. రోడ్డు ప్రమాదంపై పూర్తి సమాచారం పోలీసుల విచారణలో తేలనుంది.

## షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12 ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్స్ తదితర అంశాలపై షీటీం సభ్యులు స్వప్న, రజని, ధినేష్‌లు వివరించారు. విద్యార్థినులు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇంస్ట్రాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌డిపిఎస్ యాక్ట గురించి గంజాయి పండించిన, సేవించిన సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే ఇతర ఎమైనా వేధింపులకు గురైనట్లయితే పోలీసులను సంప్రదించాలని, కాగజ్‌నగర్ షీఈం నెంబర్ 8712670565 లేదా 100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, షీటీం సిబ్బంది, పాల్గొన్నారు.

# ఘనంగా వీరమ్మ బోనాలు

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరమ్మ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలు వీధుల గుండా మడేళేశ్వర స్వామి విగ్రహంతో మహిళలు బోనం ఎత్తుకొని డప్పు చప్పులతో ఊరేగింపుగా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం మహిళలు వీరమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు,మహిళలు పాల్గొన్నారు.



## రైల్వే అండర్ పాస్ కింద రోడ్డు మరమ్మతు చేయించిన వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుండి మెట్‌పల్లి వెళ్లే మార్గంలో రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి కింద రోడ్డు బురదమయం కావడంతో రైల్వే గేట్ పడినప్పుడు వాహనదారులు అండర్ పాస్ బ్రిడ్జి కిందకి వెళ్లే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఎవరూ ఆ రోడ్డు దుస్థితిని పట్టించుకోకపోవడంతో ఇబ్రహీంపట్నంవ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఎల్లాల వెంకట్ రెడ్డి తన సొంత డబ్బులతో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద బురద మయంగా ఉన్న రోడ్డుపైన మొరం పోయించి రోడ్డును అందుబాటులోకి తెచ్చి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులను తొలగించారు. ఈ పనులు చేపట్టడానికి రైల్వే శాఖ అనుమతితో పాటు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు ఆదేశాలతో ఈ పనులు చేసినట్లు ఎలాల వెంకట్ రెడ్డి తెలిపారు.

## కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** పంచాయతీ కార్యదర్శులు తమ తమ గ్రామాల్లో ప్రజలజకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని నిజాంసాగర్ మండల ఎంపీడీఓ గంగాధర్ సూచించారు. నిజాంసాగర్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వనమహోత్సవం, ఫిట్టింగ్ ప్లాంటులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ప్రజలు రోగాలకు దూరంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గంగాప్రసాద్, ఉపాధిహమీ సిబ్బంది శివ, ఏపీఎం, ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని బేర్షెబా చర్చిలో బి.యోహాను ఆధ్వర్యంలో గొల్లపల్లి మండలం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా బిషప్ డేవిడ్ ,ఉపాధ్యక్షులు పాస్టర్ పి కుమార్,ప్రధాన కార్యదర్శి పాస్టర్ బి సైమాన్ ,సంయుక్త కార్యదర్శి పాస్టర్ సిహెచ్ జాషువా ,కోశాధికారి పాస్టర్ కె ,ఇమ్మాను యేల్,కార్యవర్గం సభ్యులుగా డేవిడ్ ,సత్యానందం ,గిద్యోను,జి డేవిడ్,బ్రదర్ ఎన్ దానియేలు,బ్రదర్ ఎస్ సతీష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బేటీ బచావో బేటీ పడావో అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని అగ్గిమల్ల గ్రామంలోని పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మహిళా సాధికారత బృందం వారు నిర్వహించిన్న భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అంకురం అనే పేరుతో అందులో పాఠశాలలో ఉన్న పిల్లలికి అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా మహిళ సాధికారత కేంద్రం బృందం వారు మాట్లాడుతూ లింగ సమానత్వం, లింగ వివక్షత, మగ పిల్లలకి లింగ సమానత్వం గురించి పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ, నిషేధం పరిష్కార చట్టం 2013 మానసిక ఆరోగ్యం, చదువులలో అధిక ఒత్తిడిని ఎలా జయించాలి అనేదాన్ని పై ,ఋతు పరిశుభ్రత పై అవగాహన ,భేటీ బచావో భేటీ పడావో గురించి వివరించడం జరిగిందాని వారు తెలిపారు. ప్రతి బాలికను చదివించాలని విద్య తోనే మహిళా సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. ఆడపిల్లలకి ఉన్నత విద్యా చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలు ఆడపిల్లల పైన వివక్షత, వారి యొక్క ప్రాముఖ్యత ఆడపిల్లను చదివించాలి,మహిళ హక్కులు రక్షణ పై వివరించడం జరిగిందాని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నోపాధ్యాయురాలు సునీత, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం ,జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, గౌతమి, సఖి కేంద్ర బృందం శారద , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న పేట ఉన్నత పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని అగ్గిమల్ల గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో బుధవారం శీను నాయక్ దంత వైద్య శాల వైద్యుడు రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ పిల్లలందరూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని తెలిపారు.అలాగే అతి చల్లటి పదార్థాలను,అతి వేడి పదార్థాలను అసలే తీసుకో రాదని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరికీ దంతాల సంరక్షణ పట్ల సంపూర్ణమైన అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి ,అవసరమైన వారికి ఉచితంగా మందులు టూత్ పేస్ట్ లు బ్రష్ లు అందజేశారు. ఈ కార్యక్రమ ఏర్పాటుకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి డాక్టర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులుఅమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు .డాక్టర్ రాజు ను ఈ సందర్భంగా అభినందించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాళ్ల అమర్ నాథ్ రెడ్డి ,ఉపాధ్యాయులు కర్ణాకర్ ,రాజేశం ,హరికృష్ణ ,సత్య ,రవీందర్,బాలచంద్రుడు ,చంద్రశేఖర్ ,శరత్ చందర్,విజయ ,ప్రకాష్ ,స్రవంతి,నందయ్య,రాజ నరసయ్య,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితా సవరించాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మొన్నటి రోజున విడుదల చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జాబితా ఏమాత్రం నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్వహించారని దీనిని వెంటనే సవరించాలని టిఆర్ టిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్న గారి నారాయణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం టి ఆర్ టి ఎఫ్ జిల్లా సమావేశం సిరిసిల్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.ఈ విద్యా సంవత్సరంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట తర్వాత పాఠశాలలో పెరిగిన విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాల్సి ఉన్నా కూడా ప్రస్తుత సంఖ్యను పరిగణలోకి తీసుకోకుండా పూర్వ విద్యా సంవత్సరం యొక్క యుడైస్ సంఖ్య ఆధారంగా అడ్జస్ట్మెంట్ చేయడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం మొదట కాంప్లెక్స్ యూనిట్ గా ఆ తర్వాత మండల యూనిట్ గా మరియు ఆ తర్వాతనే జిల్లా యూనిట్ గా తీసుకోవాల్సి ఉండగా ఒక మండలంకు సంబంధించిన ఉపాధ్యాయులను దూరంగా ఉన్న మండలంకు ఇవ్వడం జరిగిందన్నారు. వర్క్ అడ్జస్ట్మెంట్ కాకుండా సెప్లింగ్ చేయడం జరిగిందన్నారు. అధికంగా ఉన్న టీచర్లను అవసరమున్న పాఠశాలలకు కేటాయించాల్సి ఉండగా, అవసరమున్న చోట కూడా టీచర్లను తరలించి అక్కడికి వేరే టీచర్లను ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో జరిగిన అసంబద్ధమైన, నిబంధనలకు విరుద్ధమైన వర్క్ అడ్జస్ట్మెంట్ ఉత్తర్వులను నిలుపుదల చేసి సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మండల అధ్యక్షుడు పోతుగంటి రమేష్, మహేష్ ని లక్ష్మీ నారాయణ బూట్ల శ్రీనివాస్, ఆసాని అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో నేడు బిసిలకు కృతజ్ఞత సభ

**ప్రజాపక్షం/ధర్మపురి:** బిసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర క్యాబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభను నిర్వహిస్తుండగా కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సంగనబట్ల దినేష్, వైస్ ప్రెసిడెంట్ వేముల రాజేష్ తెలిపారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న ఈ అభినందన సభకు మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. పార్టీలకతీతంగా నియోజకవర్గ పరిధిలోని బీసి వర్గాలు భారీగా తరలిరావాలని దినేష్, రాజేష్‌లు పిలుపునిచ్చారు.

## దేవస్థానానికి గోడ పంకాలు బహుకరణ



**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహ స్వామి దేవస్థానానికి భక్తుల సౌకర్యార్థం నాలుగు వాల్ ఫ్యాన్లను బహుకరించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ పిన్న శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో దేవస్థానానికి అందజేశారు. పిన్న శ్రీనివాస్ చేస్తున్న సేవలను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్త ఎదులాపురం మహేందర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడాల రవీందర్, పప్పుల శ్రీనివాస్, రాపర్తి నర్సయ్య, రంగ హరినాథ్, గునిశెట్టి రవీందర్, విజయ్ కుమార్, సతీష్, వినయ్, అర్చకులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పండ్ల తోటలపై రైతులు ఆసక్తిని పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/ధర్మపురి:** వరి పంటలపైనే కాకుండా రైతులు ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని జగిత్యాల డిఆర్డీవో రఘునందన్ అన్నారు. ధర్మపురి మండలంలోని జైనా, మగ్గిడి గ్రామాల్లో బుధవారం పర్యటించి అక్కడున్న రెవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటి ప్లాంటేషన్‌లను పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరిత హారంలోని మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని వివిధ రకాలైన పూల మొక్కలను నాటారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న మద్యాహ్న భోజనం పరిశీలించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. గ్రామంలో ఇచ్చిన మొక్క ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న మద్యాహ్న భోజనం పరిశీలించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. గ్రామంలో ఇచ్చిన మొక్కల లక్ష్యాన్ని తప్పకుండా పూర్తి చేయాలని, అందుకు అనువైన స్థలాలను ఎంచుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకుంటున్న వడ్డీ లేని రుణాలపై మరింత అవగాహన కల్పించాలని వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలని డిఆర్డివో రఘునందన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రవీందర్, ఎపివో సుజన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించండి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తమకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ క్షేత్రసహాయకులు నిజాంసాగర్ ఎంపీడీఓకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. తమకు రావాల్సిన 3 నెలల వేతనాలు రావడం లేదని దీని వలన తాము తమ కుటుంబాలను ఇతరుల వద్ద అప్పులు చేసి పోషించుకుంటున్నామని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి తోడు తమకు పని ఒత్తిడి సైతం ఎక్కువగా ఉందని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్‌యుటిఎఫ్ సంఘ సభ్యత్వ నమోదు..



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలో టిఎస్‌యుటిఎఫ్ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు ఆధ్వర్యంలో బుధవారం రోజున అన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, 2023 జూలై 1 నుండి అమలు చేయాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలు పరచాలని కోరారు. ఇప్పటికీ రెండు సంవత్సరాలు గడిచినా నివేదిక వెలువరించకపోవడం అన్యాయమని, వెంటనే పిఆర్‌సి నివేదికను బహిర్గత పరిచి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్‌తో వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్‌మెంట్ ఉద్యోగుల బెనిఫిట్స్ వెంటనే రిలీజ్ చేయాలని, జిపిఎఫ్ లోన్స్ పార్ట్ ఫైనాన్స్, టిజిజిఎల్‌ఐ ఫైనల్ పేమెంట్స్, సరెండర్ లీవ్స్ తదితర పెండింగ్ బిల్లులు అన్నింటిని వెంటనే రిలీజ్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రయత్నం చేయాలని తెలిపారు. అలాగే అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రి ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్, మండల ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, శేఖర్ తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్ధరహితం..

- మాజీ జడ్‌పిటిసి చీటి లక్ష్మణ్‌రావు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్థరహితమని ఎల్లారెడ్డిపేట మండల మాజీ జడ్పీటీసి చీటి లక్ష్మణ్‌రావు అన్నారు.బుధవారం ఆయన బీఆర్ఎస్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,తోట ఆగయ్యపై నిరాదారమైన ఆరోపణలు అర్ధరహితమని విమర్శలు గుప్పించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సామాన్యులకు ఇసుక అందుబాటులో లభించిందని పేర్కొన్నారు.నాడు 1800 ఉండగా నేడు ఐదువేల వరకు ఇసుకకు డబ్బులు వెచ్చించవలసి వస్తుందని అన్నారు.ఇది చాల దారుణమని,ఇంటి నిర్మాణాల పేరిట ఇసుకను దోపిడి చేస్తున్నారని దొంగే దొంగది అన్నట్లుగా ఉందని కాంగ్రెస్ బుద్ధి చెప్పుతామని అన్నారు.సమావేశంలో సీనియర్ నాయకులు అందె సుభాష్,నమిలికొండ శ్రీను,సందీప్,తిరుపతినాయక్,శ్రీకాంత్, సీత్యానాయక్,మీసం రాజం,దర్వేష్,మందాటి రాజు ఉన్నారు.

## కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా విజయలక్ష్మి

**ప్రజాపక్షం / చందుర్తి :** చందుర్తి ప్రభుత్వ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మెదక్ జిల్లా సదాశివ పేట ప్రభుత్వ కళాశాల నందు జూనియర్ లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్న ఆమె పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన విధులు సమర్ధవంతగా నిర్వహిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యనమైన విద్య అందిస్తూన్నామని , అంకితభావం కలిగిన అధ్యాపక బృందం విద్యార్థుల ప్రగతికి కృషి చేస్తున్నారని కావున మండలం లో పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు తమ కళాశాలలో అడ్మిషన్ పొందాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కళాశాల అధ్యాపక బృందం పుష్పగుచ్చంతో స్వాగతం పలికి శాలువతో సన్మానించారు.

## సబ్ స్టేషన్‌లో విధుల నిర్వహణ సక్రమంగా నిర్వహించడం లేదు...

**ప్రజాపక్షం/లక్ష్మణచందా :** లక్ష్మణచందా మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ లో సిబ్బంది సక్రమంగా పని నిర్వహించడం లేదని గ్రామస్తులు సబ్ స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు.ఇష్టరీతిన వ్యవహరిస్తుండటం కారణంగా విద్యుత్ సరఫరాలో తరుచుగా అంతరాయం ఎర్పడుతుందని ఆవేధన వ్యక్తం చేశారు.రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.కాబట్టి పై అధికారులు చర్యలు తీసుకొని గ్రామస్తులకు,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎంపిడివోకు వినతి



**ప్రజాపక్షం/గంగాధర:** గతంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ గంగాధర మండల తాజా మాజీ సర్పంచులు ఎంపిడివో దమ్మని రాముకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ 2019 24 వరకు సర్పంచ్ పదవిలో కొనసాగిన వారికి గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని వాపోయారు. పదవీకాలం ముగిసి ఏడాదిన్నరైనా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దారుణమని విచారం వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచులు మేచినేని నవీన్‌రావు, మడ్లపెల్లి గంగాధర్, ముక్కెర మల్లేశం, వేముల దామోదర్, వడ్లూరి వనిత ఆదిమల్లు, ఎండి నజీరొద్దీన్, కనుకయ్య, జోగు లక్ష్మి రాజం, సాగి రమ్య మహిపాల్‌రావు, శంకర్, మల్లేశం తదితరులున్నారు.

## ధాన్యం నిల్వ గోదాంను అక్రమంగా వాడుకుంటున్న వారిపై చర్యలు



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని పాపయ్యపల్లె రోడ్డులో నిర్మించిన ఎస్ఈఆర్‌పి ధాన్యం నిల్వ గోదాములో అక్రమంగా వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేఖకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ నిధుల ద్వారా నిర్మించిన ఎస్ఈఆర్‌పి ధాన్యం గోదామును గత పదేళ్లుగా ఎలాంటి కిరాయి చెల్లించకుండా రైస్‌మిల్లు యజమానులు వాడుకుంటున్నారని, వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి నుంచి వాడుకున్న కాలానికి కిరాయి వసూలు చేయాలని, ప్రస్తుతం వాడుకునే కాలానికి టెండర్ వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు దొంగల రాములు, పలకల రాజిరెడ్డి, జంగ జైపాల్, కనకం సాగర్, రాసమల్ల శ్రీనివాస్, కొయ్యడ కుమార్ యాదవ్, చెర్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, ఎలుకపెల్లి సంపత్, దాసరి సంపత్, వడ్లకొండ రాజేందర్, గూళ్ల రాజు, బొజ్జ సాయి ప్రకాష్, రంజిత్ తదితరులున్నారు.

## మెరుగైన సేవల కోసం తపాలా సేవల్లో ఐటి 2.0 సాంకేతికత

పోస్టల్ సూపరిండెంట్ శివాజీ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్ర తపాలా శాఖ సర్కిల్, రీజినల్ కార్యాలయాల ఆదేశాల మేరకు తపాలా సేవల్లో ఆధునీకరణ దిశగా మరో ముందడుగు వేసింది. జులై 22 నుంచి కరీంనగర్ డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఐటి 2.0 సాంకేతికతను అందుబాటులోకి తేనున్నట్లు పోస్టల్ సూపరిండెంట్ కె.శివాజీ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కొత్త సాంకేతికతను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే నల్గొండ డివిజన్, హైదరాబాద్ సౌత్, ఈస్ట్ డివిజన్లో జులై 8 తేదీన ప్రారంభించారని, ఇప్పుడు రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్నారని వివరించారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న 2 హెడ్‌పోస్టు ఆఫీసులు, 52 సబ్ పోస్టు ఆపీసులు, 389 బ్రాంచ్ పోస్టు ఆఫీసుల్లో ఈ కొత్త సాంకేతికతను అమలు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ ఆధునీకరణతో పార్సిల్, సివొడి, విపిపి వంటి సేవల బట్వారా వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. డిజిటల్ సిగ్నేచర్, డిజిటల్ మోడ్ వంటి ఆధునిక సదుపాయాలు వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో జులై 18, 19 తేదీల్లో తయారీ పనులు, జులై 21న పూర్తిస్థాయిలో లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. ప్రజలు తమ తపాలా లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ మార్పు వల్ల తాత్కాలికంగా కొన్ని అసౌకర్యాలు కలగవచ్చునని, వాటిని సమర్ధంగా అదిగమించి మెరుగైన సేవలు అందించేందుకు ఇది ఒక పెద్ద ముందడుగని పేర్కొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్‌వో

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఫార్మసీ రూం, లేబర్ రూం, రికార్డులను పరిశీలించారు. ఎన్‌సిడి క్లినిక్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బిపి, షుగర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ , సర్వైకల్ క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. లెప్రసీ సర్వేను ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించి ప్రాథమిక దశలో గుర్తించాలని, టిబి వ్యాధి నిర్ధారణ కొరకు ఏసిఎఫ్ క్యాంపులు నిర్వహించి శాంపిల్స్ సేకరించాలని సూచించారు. ప్రతి మంగళవారం , శుక్రవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పిఓఎంసిహెచ్ డాక్టర్ సనా జవేరియా, వైద్యాధికారి తులసీదాస్, డిపివో స్వామి, సిహెచ్‌వో శ్యామల, హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్, మోహన్ రెడ్డి తదితరులున్నారు.

## కార్మికులతో పనిచేసిన ఎంపిడివో పుల్లయ్య

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఎంపిడివో పుల్లయ్య శ్రమదానం పని చేశారు. ఈ సంధర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ గ్రామ శుభ్రతపై పారిశుద్ధ్య కార్మికులు శ్రద్ద వహించాలని, వర్షాకాలంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు.

## అన్నదాతల ఆర్ధిక వృద్ధికి సహకారం..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** అన్నదాతల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘం కృషి చేస్తుందని ఎల్లారెడ్డిపేట మండల సహకార సంఘం అద్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ ఏడుగురు రైతులకు38.00,000లక్షల రూపాయల విలువ చేసె చెక్కులను అందచేశారు.మండల కేంద్రంతో సహ బొప్పాపూర్,నారయణపురం,హరిదాస్‌నగర్‌కు చెందిన రైతులకు చెక్కులను అందించారు.దీర్ఘకాలిక ఋణాలను సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం ద్వార ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతో పాటుగా అరుబంధరంగాలు డైరీ,కోళ్ళపెంపకం,బోరుమోటార్,పైపులైన్,ల్యాండ్,ల్యాండ్ డెవలప్‌మెంట్,కర్శకమిత్ర,ట్రాక్టర్,హార్వెస్టర్లు సహకార సంఘాలకు ఇచ్చే దీర్ఘకాలిక ఋణాలను వాడుకుని ముందుకు సాగాలని అన్నారు.కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ జంగిటి సత్తయ్య,డైరక్టర్లు దొమ్మాట నర్సయ్య,నేవూరి వెంకట నర్సింహారెడ్డి,రైతులు పర్శరాములు,ప్రభాకర్,ఎల్లయ్య,ఎల్లవ్వ,వేణుగోపాల్‌రెడ్డి,కిషోర్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

మాజీ ఎంపిపి నేరెళ్ళ దేవేంధర్

**ప్రజా పక్షం / ఇబ్రహీంపట్నం:** అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి సారధ్యంలో ,రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో దేవేందర్ మాట్లాడారు. 18 నెలల కాలంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.రైతుబంధు, రైతుబీమా తదితర సంక్షేమ పథకాలను అందజేయడమే కాకుండా ఇటీవలే రాష్ట్రంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు,నుతన రేషన్ కార్డుల మంజురు అందుకు నిదర్శనం అన్నారు. కోరుట్ల నియెజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు,రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు సహకారం తో నియెజికవర్గం పరిదిలో పార్టీ లకు అతితంగా ముఖ్యమంత్రి సహాయనిధి, ఇందిరమ్మ ఇల్లు , ఇటివలే మండలంలోని యామపూర్ గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు బత్తుల శ్రీనివాస్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందించడం పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందడం అందుకు నిదర్శనం అని మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ గుర్తుచేశారు.

## అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల పూజలు

**ప్రజాపక్షం / హాజీపూర్ :** నంనూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం మండల పూజలు నిర్వహించారు. గత నెల 5న ఆలయ ఆవిష్కరణ, విగ్రహ ప్రతిష్టాపన చేసిన అనంతరం 41వ రోజున ఈ మండల పూజలను ఘనంగా జరిపారు. వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రధాన దాత ఆంకార్ పద్మశ్రీ సత్యనారాయణ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బేర పోచయ్య పద్మ దంపతులు హోమ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనమాల నాట్య కళా నిలయం ఆధ్వర్యంలో నృత్య కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నృత్య కళాకారులకు మెమెంటోలు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి స్వామి, ఆకిరెడ్డి వెంకటేష్, అత్తే తి రుపతి, కారుకూరి తిరుపతి, గోపు లింగయ్యతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాపల్లి సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ ప్రారంభం

**ప్రజాపక్షం / హాజీపూర్ :** మండలంలోని రాపల్లి సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 11 కెవి బ్రేకర్‌ను బుధవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి జాడే ఉత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త బ్రేకర్‌తో ధర్మారం, నర్సింగపూర్, రాపల్లి గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. గతంలో తరచూ విద్యుత్ అంతరాయాలు జరిగేవని, ఇప్పుడు ఆ సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ కైసర్, ఎడి వెంకటేశ్వర్లు, ఎఇ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై దశలవారీగా పోరాటం

### టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజకమలాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/ పెంచికల్‌పేట్ :** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం చేస్తామని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యం. రాజకమలాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎల్లూరులోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాజకమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యలపై ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో మండల తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేస్తామన్నారు.పెన్షనర్లు, ఉపాధ్యాయుల బిల్లులను విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు 5571 హెచ్‌వైం పోస్టులను మంజూరు చేయాలని చెప్పారు. పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్ పూర్తయిన నేపథ్యంలో జిఒ 2,3,9,10లను రద్దు చేసి జిఒ 11,12 ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు మార్గదర్శకాలు సవరించాలని, పైరవీ డిప్యూటేషన్లు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గురుకుల టైం ్ం సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ఘనంగా కార్మెల్ డే



**ప్రజాపక్షం / మంచిర్యాల :** ఎసిసి మంచిర్యాలలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ (స్టేట్, సిబిఎస్ఇ) లో బుధవారం కార్మెల్ డే వేడుకలు ఆత్మీయ వాతావరణంలో వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం జూలై 16న నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కార్మెల్ తల్లి ఆరాధనకు అంకితం చేస్తారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణను విద్యార్థులు శుభ్రంగా అలంకరించి, ప్రత్యేక ప్రార్థన సమయం ఏర్పాటు చేశారు. భక్తిగీతాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు కార్మెల్ తల్లి సేవా దృక్పథం, త్యాగ మార్గాన్ని వివరిస్తూ ప్రసంగాలు చేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ డానియల్ మాట్లాడుతూ, 'కార్మెల్ తల్లి జీవితం అందరికీ ఆదర్శం. త్యాగం, ప్రేమ, సేవా భావం వంటి విలువలను విద్యార్థులు జీవితంలో పాటించాలి' అని సూచించారు. సిబిఎస్ఇ కార్మెల్ ప్రిన్సిపాల్ సిస్టర్ రినేట్, స్టేట్ కార్మెల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సారూప్య ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువలపై సందేశం ఇచ్చారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని పాఠశాల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

### ఎంపిడిఒ కోట ప్రసాద్



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండల ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రైడే కార్యక్రమం, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, పిఎంఎవై జి మొబైల్ యాప్‌లో లబ్దిదారుల వివరాలు నమోదు చేయుట, ఆసరా పింఛన్లు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతీ వార్డుల్లో చెత్తా చెదారంతో పాటు మురికి నీరు నిల్వకుండా చూడాలన్నారు. రహదారులు డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ బ్లీచింగ్ వేయించాలన్నారు. ప్రతీ శుక్రవారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తల సమయవంతో డ్రైడే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా టార్గెట్ ప్రకారం మొక్కలు నాటాలని, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. గ్రామాల వారిగా ఆసరా పింఛన్ లబ్దిదారులు చనిపోయినచో వారి పేర్లు వెంటనే తొలగించి వారి స్థానంలో భార్య లేదా భర్తలకు పింఛన్ లభించే విధంగా ప్రతిపాదనలు సమర్పించాలని, గ్రామ పంచాయతీ రికార్డులను పకబ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమిక్షించిన ఆయా అంశాలపై నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ లోపాలు... సొమ్ము రికవరీ




**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** ంజిఎన్‌ఆర్‌ఇజిఎ పనుల్లో పలు లోపాలు చోటుచేసుకున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సిర్పూర్ టి మండల ప్రజావేదికలో బుధవారం నిర్వహించిన నాల్గవ తనిఖీలో రూ.64,773 రికవరీ విధించినట్లు డిఆర్‌డిఒ దత్తా రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులలో అవకతవకలు, పనుల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. దీంతో సిబ్బందిపై రూ.8 వేల వరకు పెనాల్టీలు విధించినట్లు చెప్పారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకూడదని అధికారులు హెచ్చరించారు. తదితర అంశాలపై లోతుగా విచారణ కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సత్యనారాయణ, హెచ్‌ఆర్ మల్లేశ్, ఎస్‌టిఎం వే ణు, ఎపిఒ చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జిఒ 49 రద్దు చేయండి

### తహసీల్దార్, ఎఫ్‌ఆర్‌ఒ లకు ఆదివాసీల వినతి



**ప్రజాపక్షం / చింతలమానేపల్లి :** పేసా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 49ను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. చింతలమానేపల్లి మండలంలో తహసీల్దార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌లకు తుడుందెబ్బ, రాయి సెంటర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్‌ల పరిధిలో పారెస్ట్ క్యాన్సర్వేషన్ పేరుతో జిఒ 49ను అమలు చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నేతలు మాట్లాడుతూ, 1996లో కేంద్రం తీసుకొచ్చిన పేసా చట్టం ప్రకారం అడవుల సహజ వనరుల నిర్వహణ, భూ సేకరణ, పునరావాస ప్రక్రియల్లో గ్రామసభ అనుమతి తప్పనిసరి అన్నారు. కానీ ఏ గ్రామంలోనూ గ్రామసభలు, తీర్మానాలు లేకుండానే అటవీశాఖ అధికారులు జిఒ 49ను అమలు చేయడం అభ్యంతరకరమన్నారు. ప్రతి గ్రామంలో గ్రామసభ తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నామని తెలిపారు. త్వరలో తుడుందెబ్బ అనుబంధ సంఘాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టి జిఒ 49 రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి సుగుణాకర్, సర్మెడి కుమురం కనకయ్య, ఉప మేడి ఎదుల సాగర్, బాబాసాగర్, కత్తెర్ల భీమేష్, డబ్బా నాయకుడు సిడాం పెంటయ్య, కొలవార్ మహిళలు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారి పాఠశాల తనిఖీ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను విద్యాశాఖ అధికారి అమర్‌సింగ్ బుధవారం తనిఖీ నిరన్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించడంతో ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం వండిపెట్టాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు, గ్రామపెద్దలు దఫేదర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

## కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జలజీవన్ మహిళా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిజాంసాగర్ మండలకేంద్రంలో ప్రారంభించారు. ఫీల్డు కోఆర్డినేటర్ అంజమ్మ, ఐకేపీ సీసీ సాయిబాబాలు మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో 20 నుండి 30 మంది మహిళలకు కుట్టు శిక్షణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణ నెల రోజుల పాటు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం 50 శాతం సబ్సీడీపై కుట్టు మిషన్లను అందజేస్తామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లు సైతం అందజేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు తులసి, సీఏ రాధా, లక్ష్మి , యువతులు పాల్గొన్నారు.

## తుమ్మిడే శేఖర్ కుటుంబానికి పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

### నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** పెంచికల్‌పేట్ అగర్ గూడాలో జరిగిన దారుణ ఘటనలో మృతి చెందిన తుమ్మిడే రాజ్ శేఖర్ కుటుంబాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని స్పష్టం చేశారు. తుమ్మిడే శేఖర్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర ఆఘాతంలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి నిందితులను గుర్తించి, చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ప్రాంతీయంగా తీవ్ర చర్చ కొనసాగుతోంది. న్యాయం కోసం వివిధ వర్గాల నుండి ఒత్తిడి పెరుగుతోంది.

## తలమడుగులో నాణ్యతలేని రోడ్డు



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** తలమడుగు గ్రామంలో నాణ్యతలేని సిమెంటు రోడ్డు నిర్మాణంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆయన, రోడ్డు నిర్మాణం పూర్తిగా నిబంధనలు పాటించకుండా జరిగినట్లు పేర్కొన్నారు. నిర్మాణంలో నిర్లక్ష్యం వల్ల గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు పగుళ్లు, గుంతలు ఏర్పడటంతో గ్రామస్తులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామస్థులు ఈ విషయాన్ని అధికారులకు ఎన్నో సార్లు చెప్పినప్పటికీ స్పందన లేకపోవడం గమనార్హమన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని, నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత శాఖలను ఆర్ఎస్ ప్రవీణ్ కోరారు. గ్రామస్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

# నిర్మల్ నవసంఘర్షణ సమితి నూతన కమిటీ నియామకం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా నవ సంఘర్షణ సమితి నూతన కార్యవర్గాన్ని బుధవారం రోజు నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ ప్రకటించారు.నిర్మల్ జిల్లా అధ్యక్షునిగా షేక్ ఫిరోజ్,ప్రధాన కార్యదర్శిగా మర్రి నవీన్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ మక్బూల్ నియమితులయ్యారు.వీరికి నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నవసంఘర్షణ సమితి అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ మాట్లాడుతూ,బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది ఎండమావి లాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడున్న అన్ని రాజకీయ పార్టీలు ఒకే పుట్టలో నుంచి పుట్టిన చీడ పురుగులని,అవి బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేక్మని ఆరోపించారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో బీసీలకు రావాల్సిన ఉద్యోగాలను ఓసిలకు కట్టబెడుతున్నాయని మండిపడ్డారు.బీసీ నాయకులు తొందరపడి 42 శాతం రిజర్వేషన్లు వచ్చినట్లుగా భావించి సన్మానాలు,పాలాభిషేకాలు చేయడం మానుకోవాలని ఆయన కోరారు.''విషం ఎన్నిసార్లు వడపోసినా అమృతం కాద'' ని పేర్కొంటూ,ప్రస్తుత పాలకుల మనసు మారదని,వారిని ఓడించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని అందరూ కలిసి పని చేయాలని గజేందర్ యాదవ్ పిలుపునిచ్చారు.అధికారం కేవలం ఓటు ద్వారానే సాధ్యమని,బీసీలలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ,మైనారిటీ యువత,నాయకులు పాల్గొన్నారు.

## ఐటిడిఏ పాఠశాలలను తనిఖీ

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్:** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని రాజులమడుగు,జిల్లేడికుంట,గ్రామాల్లో ఐటిడిఏ పాఠశాలలను బుధవారం ఎసిఎంవో శివాజీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులను,విద్యార్థుల హాజరు పట్టికలను,బోజన మెనూ లను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ పాఠశాలకు రాని విద్యార్థులను వారి నివాసాలకు వెళ్లి విద్యార్థులను తీసుకొని వచ్చేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని సూచించారు.ఐటీడీఏ విద్యార్థుల అక్షరాస్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అక్షరాస్యతను మెరుగుపరచాలని అన్నారు.విద్యార్థులు పాఠశాల మానేయకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఆయనతో పాటు ఎస్సీ ఆర్పి జంగు పటేల్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శ

**ప్రజాపక్షం/తానూర్:** మండలంలోని వడ్గం, దాల్తాబాద్, ఝరి, గ్రామాలల్లో ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం బాధిత కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యత కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హెచ్ పుండ్లిక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, సాధశివ్ పటేల్, గోవిందరావు పటేల్, చంద్రకాంత్, మధు పటేల్, మాజీ సర్పంచ్ సంజేయ్, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## నూతన తాహసీల్దార్‌కు ఘన సన్మానం..

**ప్రజాపక్షం/తానూర్:** ఇటీవలే నూతనంగా నియమింపబడిన తాసిల్దార్ మహేందరర్నాథ్ కుబుధవారం తాసిల్దార్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ బలే రావ్, బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ మౌలాఖాన్, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఘని, పోశెట్టి, పవార్ భీమ్ రావ్, శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఒకేఆర్ ఫౌండేషన్ సాయం..



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ మండలం సుభాష్ నగర్ కాలనీకి చెందిన జెట్టి ధర్మయ్య అనే ట్రాక్టర్ డ్రైవర్ ఆరోగ్యం బాగా లేక వారం రోజుల క్రితం మరణించాడు.ధర్మయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.అందులో ఒక కుమారుడు వికలాంగుడు కావడంతో వారి పరిస్థితిని ఒకే ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డేపల్లి కృష్ణంరాజుకు తెలుపగా వారి దీనవ్యవస్థను చూసి వారి కుటుంబానికి తన వంతు సహాయంగా ఫౌండేషన్ తరపున మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు ఓకేఆర్ సభ్యుల ద్వారా తనకు తెలియజేస్తే వెంటనే సాయం చేస్తానని,పిల్లలకి ఎట్లాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే హాస్పిటల్లో ఎలాంటి అవరసరమైనటువంటి సహకరిస్తానని తెలిపారు.వారి కుటుంబానికి ఎల్లవేళ అండగా ఉంటాను అని ఓకెఆర్ వ్యవస్థాపకుడు కృష్ణరాజు భరోసగా ఉంటారని ఒకెఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంబాల భీమన్న,దూడం శ్రీనివాస్,సంగర్తి రాజన్న,మడిగేల అనిల్,ప్రకాష్ గౌడ్,భీమేష్ ఓకేఆర్ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరుపై ఎంఈఓ పర్యవేక్షణ..



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ మండల పలు గ్రామాలలో మండల విద్యాధికారి వివిధ పాఠశాల పర్యవేక్షించారు. మండలంలోని తర్లపాడు ప్రాథమిక పాఠశాల, సత్తెనపల్లి ఉన్నత పాఠశాల,రామ్‌రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, ఎల్లాపూర్ ఉన్నత పాఠశాల, గోసంపల్లి ప్రాథమిక ఉన్నత, దిల్వార్పూర్ ప్రాథమి పాఠశాల, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా తను మాట్లాడుతూ పాఠశాలల సమయపాలన పాటించి, విద్యార్థుల పర్యవేక్షణ చేయాలని, విద్యార్థుల పర్యవేక్షణ చేయాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్నచోట ఉపాధ్యాయులను, సర్దుబాటు చేస్తామని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని పాఠశాలకు సరిగా హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, వివిధ పాఠశాల ఉన్న సమస్యలను తెలుసుకోవాలి ఆయా పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయులకు సూచించనాని తెలిపారు.

## జాన్కంపేట్‌లో వనభోజనాలు, భజన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** బోధన్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం వాసవి గ్రూప్ సభ్యులు, గోశాల రోడ్డు, ఎల్విఎస్ నగర్, గంజి ఆర్టీసీ కాలనీ, రాకాసిపేట్ ప్రాంతాలకు చెందిన కుటుంబాలతో కలిసి ఎడపల్లి మండలంలోని చారిత్రాక జాన్కంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం, ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులంతా వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక సామూహిక విందుకు సంఘ సభ్యులు ఉత్సహంగా పాల్గొన్నారు. అనంతరం బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీ లక్ష్మీ నరసింహ సూత్రాల భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ భజన కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉత్సహంగా పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో సంఘ అధ్యక్షులు గంగా కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పార్శి శ్రీధర్, కోశాధికారి రాజుసెట్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిదుర ప్రదీప్ గుప్తా, డివిజన్ ఇన్‌ఛార్జి కంటాల రమేష్ గంజి వెంకటేశం, సురేష్ సెట్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజెపి పాఠశాలలో ఉత్సాహంగా బోనాల వేడుకలు

**ప్రజాపక్షం/లక్సెట్టిపేట :** పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఆషాడ మాసం బోనాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పోతురాజు అలంకారంతో విద్యార్థినులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, బోనం అంటే భోజనం. అమ్మవారికి మట్టికుండలో పసుపుతో చేసిన అన్నం, కింద వేపాకు నీళ్లు, పైకి దీపం వేసి సమర్పించడం సంప్రదాయం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెరుగుతుంది అని తెలిపారు. అమ్మవారికి ప్రత్యేకంగా వండిన బోనంను నైవేద్యంగా సమర్పించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి ఆడి, పాడి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోరింటాకుతో రోగనిరోధక శక్తి పెంపు..

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినీలు గోరింటాకు ఉత్సవాలు జరుపుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాల్గోట్ శ్రీనివాస్ తెలిపారు.ఆషాడంలో గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయంగా వస్తోందని,అదే విధంగా సైన్స్ పరంగా గోరింటాకు పెట్టుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి రక్త ప్రసరణ మెరుగవుతుందని అన్నారు.గోరింటాకులో ఉండే సహజ లక్షణాలు,చర్మాన్ని చల్లబరిచి చర్మ వ్యాధులను నివారిస్తుందని తెలిపారు.చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడానికి ఒక మార్గంగా భావిస్తారని పేర్కొన్నారు.శరీరంలో ఉన్న తగు ఉష్ణం బయటకు వెళ్లకుండా కాపావుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పాఠశాల ఆడపిల్లలు పాల్గొన్నారు.

## రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** బోధన్ నియోజకవర్గ రైతులు తమ పంట పొలాల్లో చెరుకు లేదా ఆయిల్ ఫామ్ చెట్లను సాగు చేయాలని తద్వారా షుగర్ ఫ్యాక్టరీ పునఃరుద్ధరణ లేదా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యమవుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి లోని సరయు గార్డెన్స్‌లో బోధన్ నియోజకవర్గ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, ప్రియునిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ ఫామ్ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ పంట సాగుపై రైతు సోదరులకు సమగ్ర అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొని పంట యాజమాన్యం, గెలల కొనుగోలుకు సంబంధించిన పూర్తి వివరాలను రైతులకు వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని, దీనికి ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సహం లభిస్తుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో మెలకువలు, నూతన పద్ధతులు, సాగుకు అవసరమైన వనరులు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై ప్రియునిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు రైతులకు వివరణాత్మక ప్రెంజేటేషన్ ఇచ్చారు. ఈ సదస్సు ఆయిల్ ఫామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధన్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నాయకులు గడుగు గంగాధర్, పులి శ్రీనివాస్, ప్రి యూనిక్ సంస్థ ఏజీఎమ్ మల్లేశ్వర రావు, డైరెక్టర్ పాశం ప్రసాద్, వ్యవసాయ అధికారులు, డిస్టిక్ హర్టికల్చర్ అండ్ సెరికల్చర్ డిపార్ట్ మెంట్ సంబంధించిన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అందరి చూపు వేల్పూర్ వైపే

బిఆర్ఎస్,కాంగ్రెస్ నాయకుల పోటాపోటి సమావేశాలు

అందని లబ్ధిదారులతో బిఆర్ఎస్

లబ్ధిదారులతో కాంగ్రెస్ మీటింగ్‌లు

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** బాల్కొండ మండలంలో బిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారింది.గత కొంతకాలం నుండి ఈ సమస్య మరింత మాదిరి సవాల్లు,ప్రతి సవాల్లుగా మారాయి.దీంతో ఎప్పుడు ఏమీ జరుగుతుందో అని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.గత కొన్ని రోజుల క్రితం బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడకు చెందిన ఇద్దరు గల్ఫ్ కార్మికులు మృతి చెందిన సంఘటన అందరికి తెలిసిందే.వారిని పరామర్శించడానికి వెళ్ళిన మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వారిని ఓదార్చి అనంతరం మిడియాతో మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి తప్పింద న్నారు. గల్ఫ్ కార్మికులకు ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా అంతదజేయాలని డిమాండ్ చేశారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సోషల్ మిడియాలో ఒక విడియోను విడుదల చేశారు.ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా పొందిన గల్ఫ్ కార్మికులను తీసుకోని ఈనెల 17న వేల్పూర్‌లోని ఎమ్మెల్యే ఇంటికి వస్తానని సవాల్ విసరడంతో ఒక్కసారిగా నియోజక వర్గంలో రాజకీయవేడి రాజేసుకొంది.బిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా తయారైంది.కాంగ్రెస్ విసిరిన సవాల్‌కు ప్రతి సవాల్‌గా బిఆర్ఎస్ నాయకులు మేముసైతం సిద్ధం అంటు సవాల్ విసిరారు.ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు ఎంతమంది లబ్ధిదారులకు అందలేదో వారందరితో వేల్పూర్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం నాడు ఇట్టి సమావేశానికి అనుమతి కోరుతు పోలీస్‌లకు వినతిపత్రం అందజేశారు. వేల్పూర్‌లో గురువారం నాడు ఏమీ జరుగుతుందో అని నియోజకవర్గ ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. గతంలో భీమ్‌గల్‌లో కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో జరిగిన గొడవతో ఇరువర్గాలు కొట్టుకున్నంత పనిచేయడంతో బిఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జీ చేయడంతో మాజీమంత్రి,ఎమ్మెల్యే రోడ్డుపై బైటాయించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.గురువారం జరిగే జరిగే సమావేశాలకు పోలీసులు ఎలాంటి భద్రత ఏర్పాట్లు చేస్తారో చూడాలి మరి.

**సభలకు అనుమతుల నిరాకరణ..**

మండలంలో పోలీస్‌యాక్టు

మండలంలో గురువారం నాడు పోలీస్ కమీషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు బిఎన్ఎస్ 163 యాక్టు అమలు ఉంటుందని వేల్పూర్ ఎస్ఐ సంజీవ్ ఓప్రకటనలో తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాలలో నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడవద్దని సూచించారు.శాంతి భద్రతలకు విగాతం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంజీవ్ తెలిపారు. పోలీసులు అనుమతులు నిరాకరించినప్పటికి ఇరువర్గాల నాయకులు మాత్రం సభ జరపాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం.సభ జరిగితే ఎలాంటి పరిస్థితులు నెలకుంటాయో అని ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

## టెస్కా సంఘ డైరీ ఆవిష్కరణ..ఉద్యోగుల ఐక్యతకు ప్రతీక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** జిల్లా గణాంక శాఖ ఉద్యోగుల టెస్కా (తెలంగాన ఎకనమిక్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్) సంఘం డైరిని బుధవారం సాయంత్రం జిల్లా గణాంక శాఖ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష,కార్యదర్శుల సమక్షంలో జిల్లా గణాంక శాఖ అధికారి జీవరత్నం ముఖ్య అతిథిగా పాల్గొని డైరిని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా గణాంక శాఖ అధికారి మాట్లాడుతూ,ఈ డైరీ ఉద్యోగులకు తమ దైనందిన విధులలో ఎంతగానో ఉపయోగపడుతుందని,సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు.ఉద్యోగులందరికి ఇది ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుందని,కార్యకలాపాలను సులభతరం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక శాఖ అధికారులు డి.రవీందర్,జి.శ్రీకాంత్,హరీష్,ప్రశాంత్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.అలాగే,టెస్కా సంఘ అధ్యక్షుడు జాదవ్ సాయి కృష్ణ,కార్యదర్శి రాథోడ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన తాసిల్దార్‌కు ఘన సన్మానం..




**ప్రజాపక్షం/తానూర్ :** ఇటీవలే నూతనంగా నియమింపబడిన తాసిల్దార్ మహేందర్నాథ్ కు బుధవారం తాసిలార్ కార్యాలయంలో మండల బీజేపీ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల జనరల్ సెక్రటరీ నాగేష్,బూత్ అధ్యక్షుడు విట్టల్,నాగేష్ పటేల్,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కోటగిరి:** ఈ నెల 19న నిజామాబాద్ నగరంలో నిర్వహించే సిపిఐ జిల్లా మహ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఏ.విఠల్ గౌడ్ కోరారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత కమ్యూనిస్టు (సిపిఐ) 22వ మహాసభ నిజామాబాద్ నగరంలోని ప్రగతి మున్నూరు కాపు సంఘంలో జూలై 19న సిపిఐ ఉదయం 10:30గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ మహాసభలకు సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్‌లో కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, జిల్లా మహ సభలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ మండల నాయకులు కోరారు. ఈ సమావేశంలో నాయకులు నల్ల గంగాధర్, గోపి, పాషా, తోట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## దొరల పాలన కాదు..ఇది కాంగ్రెస్ ప్రజా పాలన

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో బుధవారం పిసిసి అధికార ప్రతినిధి బాల వేణుగోపాల్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి,, ఇంకా టిఆర్ఎస్ అధికారంలో ఉంది అన్నట్లు భ్రమలో ఉన్నారని, ఆ భ్రమ నుంచి బయటకు రావాలని, ఆలోచన తీరు మార్చుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్, ప్రశాంత్ రెడ్డికి హితవు పలికారు. ఇదేమైనా దొరల ప్రభుత్వం అనుకుంటున్నారా..? కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కులను మీ ఇంట్లో పంచాలనుకోవడం ఏంటి అదేమైన మీ గడి అనుకుంటున్నారా..? గత పదేళ్ల మీ పాలనలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులను మీ ఇంటికి పిలిపించి పంచినట్లు అనుకుంటున్నారా..? ప్రశాంత్ రెడ్డి. ఇది పేదోడి పాలన ప్రజా పాలన ఆ విషయాన్ని మరిచిపోవద్దని అంటున్నాము. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పాలకులు గాని అధికారులు గానీ లబ్ధిదారులకు దగ్గరికి వెళ్లాలి లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో చెక్కులు పంపిణీ చేయాలన్న విషయం తెలియదా..? అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మీరు శాసనసభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వం మిమ్మల్ని గౌరవిస్తుంది. మీ గత కేసీఆర్ పాలనలాగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అగౌరవపరిచినట్లు మా కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల రాములు, బద్దం రాజశేఖర్, మహిపాల్, నశీర్, జెడి గంగారాం, నాగభూషణం, మహమ్మద్ అంజాద్, నవీన్, దొనకాల్ రవి, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రవర్ణాల ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు తొలగించాల్సిందే



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి:** అగ్రవర్ణాలకు కల్పించిన పది శాతం రిజర్వేషన్లను వెంటనే రద్దు చేసి ఆ కోటాను బీసీలకు వర్తింపజేయాలని తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు లేకపోవటంతో విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చే ఆర్డినెన్స్‌కు ఎవరైనా అడ్డుపడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రిపుల్ ఐటి బాసర విశ్వవిద్యాలయ అడ్మిషన్లలో బీసీ బిడ్డలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చెందారు. అంతకుముందు ఆయనను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హెచ్.రేవంత్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కరిపె రవీందర్, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.నాగరాజు, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ డివిజనల్ కార్యాలయ సూపరింటెండెంట్ పోల శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎఎస్‌పి



**ప్రజాపక్షం/సోన్ :** రాజేష్ మీనా ఐపిఎస్ నిర్మల్ ఎఎస్పిపిటి సోన్ పోలీస్ స్టేషన్ ను బుధవారం తనిఖీ చేశారు.ఇందులో భాగంగా రికార్డ్స్ తనిఖీ చేసి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.సిఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై గోపి పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించి ఏఎస్‌పి కి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.స్టాఫ్ తో ఇంట్రాక్ట్ అయి వారి యొక్క డ్యూటీ లో ప్రాబ్లమ్స్ గురించి స్నేహపూర్వకంగా అడిగి తెలుసుకొని సర్వీస్ బుక్‌లను పరిశీలించారు.ప్రజలతో మర్యాదగా మెలగాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని మొక్కలు నాటి,స్టేషన్ యొక్క అన్ని విషయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్,అశోక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ డిపో నుండి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ డిపో ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రాల విహారయాత్రల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నమని బుధవారం రోజు,నిర్మల్ బస్టాండ్ నుండి అరుణాచలం,పళని,రామేశ్వరం,శ్రీరంగం పుణ్యక్షేత్రాలకు ఒక బస్సు బయలుదేరినట్లు డిపో మేనేజర్ కె.పండరి తెలిపారు.ప్రయాణికుల కోరిక మేరకు అరుణాచలం ట్రిప్పును ఇప్పటికే చాలాసార్లు విజయవంతంగా నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.భక్తుల సౌకర్యార్థం మీరు కోరుకున్న చోటికి బస్సులను నడుపుతామని మేనేజర్ హామీ ఇచ్చారు.త్వరలో ప్రయాగ్‌రాజ్,కాశీ,అయోధ్య,యాదగిరిగుట్ట,స్వర్ణగిరి,పండరీపూర్ వంటి ఇతర ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా బస్సులు నడుపుతామని ఆయన వెల్లడించారు.ముఖ్య గమనిక :30 మదికి పైగా ప్రయాణికులు ఉంటే,మీ గ్రామం నుంచే బస్సు ఏర్పాటు చేయబడుతుంది.మరిన్ని వివరాల కోసం ఈ నంబర్లలో సంప్రదించవచ్చు.8328021517,7382842582

## సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**ప్రజాపక్షం/మామడ:** మామడ మండలంలోని పోన్కల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని,సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని పరిశోధనల వైపు అడుగు వేయాలని సూచించారు.పాఠశాల దశ నుండే ఉపాధ్యాయులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని ఆయన కోరారు.నిర్మల్ జిల్లాలో ప్రారంభించిన బాలశక్తి కార్యక్రమంలో విద్యార్థులందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.పోన్కల్ ఉన్నత పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్,పాఠశాల వాతావరణం,క్రమశిక్షణ,పరిశుభ్రత పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వన మహోత్సవంలో మొక్కలు నాటి,బాలశక్తి లోగోను ఆవిష్కరించారు.పాఠశాలలోని ఖగోళ ప్రయోగశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా రాణించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి,నిర్వాహకులను అభినందించారు.పాఠశాల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని,పిఎం శ్రీ లో చేర్చడం,పరీక్షా కేంద్రం మంజూరు,అదనపు గదులు వంటి వాటిపై దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు.

## నల్లగుట్ట భూముల ఆక్రమణపై రాస్తారోకో

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల పరిధిలోని అయిలాపూర్ గ్రామ శివారులో ఉన్న నల్లగుట్ట భూములను కొందరు ఆక్రమించుకొంటున్నందుకు నిరసనగా గ్రామస్తులు ద్వారా మహిళలు రాస్తారోకో నిర్వహించారు. నందిపేట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. త్వరలోనే రెవెన్యూ అధికారులతో మాట్లాడతామని చెప్పడంతో రాస్తారోకో విరమింపజేశారు. గ్రామస్తులు రెవెన్యూ అదికారులను కలిసి సమస్య వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ మీసాల సుదర్శన్, గ్రామాభివృద్ధి కమిటి, అన్ని కుల సంఘాల వారు మహిళలు పాల్గొన్నారు.

# విన్నర్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని టిజివిపి డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని విన్నర్ పాఠశాల రెండు బ్రాంచ్‌లుగా విడిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, డిఇఓ ఎందుకు పట్టించుకోవడం లేదని టి.జి.వి.పి ప్రశ్నిస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విన్నర్ పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సమయపాలన పాటించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు డిఈఓకి వినతిపత్రాలు సమర్పించిన ఎటువంటి స్పందన రాలేదని ఆయన తెలిపారు. తన విధులను విస్మరించిన డిఈఓ ను వెంటనే సస్పెండ్ చేయాలని టి.జి.వి.పి డిమాండ్ చేస్తోంది. విన్నర్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కూడా కోరుతోంది.ఈ పాఠశాల ఉదయం 7 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నడుస్తున్నా విద్యా అధికారులు చేసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. రెండు బ్రాంచ్‌లు నడుపుతున్న విన్నర్ పాఠశాలకు ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సిలబస్ ను బోధిస్తూ, ఐఐటి, జెఈఈ, మెయిన్స్ వంటి అబద్ధపు మాటలు చెప్పి విద్యార్థులను చేర్చుకొని వారిపై ఒత్తిడి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమస్యపై ఉన్నత అధికారులు తక్షణమే కల్పించుకొని, పాఠశాల సమయపాలనను సక్రమంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని టి.జి.వి.పి తరపున కోరుతున్నట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ సతీష్, పట్టణ కన్వీనర్ సాయిచరణ్, రాథోడ్ అర్జున్, రాథోడ్ సచిన్, రాథోడ్ ఆకాష్, గణేష్, జాదవ్ ప్రమోద్ పాల్గొన్నారు.

## త్వరలో ఏకో టూరిజం పనులు

**ప్రజాపక్షం / నందిపేట్ :** గోదావరి పరివాహకం లో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆర్మూర్‌నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి వినయ్ రెడ్డి తెలిపారు. అటవీశాఖకు చెందిన నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయన చిన్నయానం పరిసర ప్రాంతంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతంలో ఏకో టూరిజం ఏర్పాటు చేసేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన నిదులు ఉన్నాయని చెప్పారు. మండలంలోని ఎత్తిపోతల పథకాలు మరమ్మతుకు నిధులు ఇప్పించాలని రైతులను ఆదుకోవాలని వినయ్ రెడ్డినికోరారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎలాగైనా ప్రభుత్వంతో నిదులు ఇప్పించాలని రైతులు కోరారు.

## తహసీల్దార్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** ధర్పల్లి తహసీల్దార్ శాంతను వాడీ గ్రామం వీడీసీసభ్యులు వివిధ పార్టీల నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘ నంగా సన్మానించారు. కార్యక్రమంలో వాడీ వీడీసీ చైర్మన్ జిన్న సాయిలు, లింగాపురం సాయిలు, సతీష్, సంతోష్, కాంగ్రెస్ నాయకులు యెల్లారం భాస్కర్, రోడ్ల గంగారెడ్డి, బీజేపీ నాయకులు తాళ్ల రాంచందర్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** పారిశుధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డిఆర్డిఏ రాఘవులు అన్నారు. బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ లో కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 10 వ్యక్తిగత మరుగుదొడ్ల పర్యవేక్షించారు. సిగ్రిగేషన్ షెడ్లు,ప్లాంట్స్ పాఠశాల పరిసరాలను, గ్రామ పంచాయతీ పరిశుభ్రతను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఓ విభాగానికి సంబంధించి పెద్దపల్లి జిల్లాలో డిఆర్డిఏ రాఘవులు, రేణుక, సెంట్రల్ టీం స భ్యులు కొంగ జయంత్, తుమ్మ ప్రసాద్, మం డల పంచాయతీ అధికారి, ఎంపీడీవో సురేష్, గ్రామ ప్రత్యేకాధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతలేని రోడ్ల వల్లే ప్రజలకు ఇబ్బందులు

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు
ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** నాణ్యత లేని రోడ్ల నిర్మాణం వల్లనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని తుంగమడుగు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తుంగమడుగు గ్రామంలో నాణ్యత ప్రమాదాలు, నిబంధనలు పాటించకుండా సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో రోడ్లపై మురికి నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని దోమల వల్ల గ్రామ ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. చిన్న వర్షానికే ఈ పరిస్థితి ఉండే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటని అన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించకుండా రోడ్డు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. ఈ సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

## వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



**ప్రజాపక్షం/ముత్తారం :** వరుణుడి కరుణ కోసం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామ మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కప్పతల్లి ఆటలాడారు. రెండు నెలలుగా సరైన వర్షాలు పడకపోవడంతో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో గ్రామస్తులందరూ కలిసి వరుణ దేవునికి పూజలు నిర్వహించారు. కప్పల పెళ్లిలు చేసి ఇంటింటా తిరిగి కప్పతల్లి ఆటలాడారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లగా మహిళలు జలాభిషేకం చేశారు.అనంతరం గ్రామదేవతలకు హనుమాన్ ఆలయంలో పోచమ్మ తల్లులకు ,బొడ్రాయి, గ్రామ దేవతలతో పాటు తదితర దేవతలకు గ్రామస్తులు జలాభిషేకం చేసి వర్షాలు కురవాలని దేవుణ్ణి వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ రావు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మెంగని తిరుపతి,మాజీ వార్డు సభ్యుడు ఎగుర్ల కుమార్, మెంగని దినేష్, మెంగని రవి, కూస తిరుపతి, ఎలువాక శ్రీనివాస్,అలువోజు రమణచారి, బండారి రవీందర్,ఐత రమేష్, యారా విష్ణు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్‌లో ఘనంగా గోరింటాకు వేడుకలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఆషాడ మాసం సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని బ్యాంక్ కాలనీ మహిళలు గోరింటాకు వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. బుధవారం బ్యాంక్ కాలనీలోని ధనలక్ష్మి సతీష్ నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అమ్మవారి ఫోటోకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముత్తయిదువలు అంతా కలిసి గోరింటాకు లను నూరి అమ్మవారికి పెట్టిన అనంతరం మిగతా మహిళలంతా తమ చేతులకు కాళ్లకు అలంకరించుకున్నారు అనంతరం రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయురాలు వనజ, ఐల రాధ, అనసూయ, స్వరూప, శారద, మంజుల, శ్రీదేవి తదితరులు మాట్లాడుతూ ఆషాడ మాసంలో గోరింటాకు విశిష్టత గురించి దానిని మహిళలు అలంకరించుకోవడం వెనుక ఉన్న పురాణ కథలను శాస్త్రీయ పద్ధతులను వివరించారు. ఆషాడ మాసంలో మహిళలు తప్పనిసరిగా గోరింటాకు సంబరాలు వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు అనంతరం మహిళలందరూ తీర్థప్రసాదాలు స్వీకరించి తమ కాలనీలోని మహిళలందరికీ గోరింటాకు తో అలంకరించారు. ఈ కార్యక్రమంలో అరుణ, కరుణ, సుగుణ, పద్మ, లక్ష్మి , రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



## గవర్నర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన నిజామాబాద్ పోలీసు కమిషనర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** బుధవారం నాడు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద గల తెలంగాణ యూనివర్సిటీలో రెండవ స్నాతకోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## నిరుపేదలకు అండగా ఉంటాం

బిజెపిపార్టీ మండల అధ్యక్షుడు నవీన్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** 16గామంలో నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను కబ్జా చేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేల్పూర్ మండల బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు బెల్దారి నవీన డిమాండ్ చేశారు. వేల్పూర్ మండలం అక్లూర్‌లో 1994వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా చేసి కలెక్టర్ వారికి ఇవ్వడం జరిగిందన్నారు. అట్టి భూమిని గ్రామానికి చెందిన ఒక నాయకుడు కబ్జా చేశాడన్నారు. తమ భూమిలో ఇంటి నిర్మాణం చేసుకోకుండా అడ్డుపడుతున్నాడని ఇట్టి విషయంపై బాధితులు గత మూడు రోజుల నుండి ఆందోళన చేస్తున్నారని వారికి అండగా బిజెపి నియోజకవర్గ ఇంచార్జీ మల్లికార్జున్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నాడు గ్రామానికి వచ్చి బాధితులతో మాట్లాడటం జరిగిందన్నారు.కబ్జా చేసిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కబ్జా చేసిన వ్యక్తిపై పార్టీ చర్యలు తీసుకోని బాధితుల పక్షాన నిలువాలని డిమాండ్ చేశారు.బాధితులకు న్యాయం జరిగేంతవరకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

## కత్తులతో బెదిరించి 3.50లక్షల దోపిడి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ 16 :** హార్వేస్టర కోనుగోలు చేయడానికి వెళ్తున్న వాహనదారుడి నుండి 3.50లక్షల నగదును దోచుకెళ్ళిన సంఘటన కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో జరిగింది.ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగినిపల్లికి చెందిన కోమ్ము లక్ష్మీనారాయణ తన స్నేహితుడితో కలిసి భీమ్‌గల్ మండలం వైపు వస్తున్న క్రమంలో కోనాపూర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నెంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వచ్చి వారిని అడ్డగించి అనంతరం కత్తులతో బెదిరించారని తెలిపారు.వారి వద్దనున్న 3.50లక్షల నగదుతో పాటు వారి సెల్‌ఫోన్‌లను తీసుకోని పరారయ్యారని ఎస్ఐ తెలిపారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన కటారి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలో ఏనుగు శ్రీనివాస్ రెడ్డి,తల్లి మరణించగా ,అలాగే లొత్తునూర్ గ్రామానికి చెందిన పుట్టపాక సత్యం మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ జెడ్పిటిసి ,మాజీ ఎంపీపీ ,మాజీ సింగిల్ విండో చైర్మన్ ,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ , జిల్లా సీనియర్ నాయకులు కటారి చంద్రశేఖర రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు .వారి వెంట కిష్టంపేట రమేష్ రెడ్డి,ఎర్ర సంపత్ ,కట్ట లక్ష్మణరావు,తదితరులు పాల్గొన్నారు.

